
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 కనిష్ఠం 22.7



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

బుధవారం 30 జూలై 2025

ముదురుతున్న వివాదం

- ఖానాపూర్ ఎమ్మెల్యే - అటవీ శాఖల మధ్య వివాదం
- ఫారెస్టు అధికారులే టార్గెట్‌గా ఎమ్మెల్యే హాట్ కామెంట్స్
- తీరు మార్చుకోకుంటే కేశవ పట్నం ఘటన పునరావృత మంటు హెచ్చరికలు
- టైగర్‌జోన్ పేరిటా అటవీ శాఖ కుట్రలు చేస్తుందంటూ ఆగ్రహం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు వ్యాఖ్యలు



ఆదిలాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్ పేరిట అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదివాసీ గిరిజనులను ముప్పుతిప్పలు పెడుతున్నారంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అధికారులకు సీరియస్‌గా వార్నింగ్ ఇవ్వడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రతీయేడు మాదిరిగానే ఈ యేడు కూడా వానాకాల సీజన్ ప్రారంభంకావడంతో పోడుభూముల లొల్లి మొదలైంది. తరతరాలుగా పోడునే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులను అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయడం సర్వసాధారణంగానే మారుతోంది. ఈ క్రమంలోనే పోడు రైతుల నుంచి ఎమ్మెల్యేకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఖానాపూర్, బోథ్ నియోజక వర్గాలలోనే ఎక్కువగా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధి విస్తరించి ఉంది. దీంతో ఇక్కడ పోడు సమస్యతో పాటు అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇటీవల ఇచ్చోడ మండలం సిరిచెల్మ రేంజ్ పరిధిలోని కేశవపట్నం గ్రామంలో అటవీ శాఖ, పోలీసు అధికారులపై పోడు రైతులు తిరగబడి దాడులు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. తాజాగా ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలలో అటవి శాఖ అధికారుల చర్యలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురికావడంపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తన మాట లతూటాలతో అటవిశాఖ అధికారులపై ఫైర్ కావడం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.ఎమ్మెల్యే వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతుంది.

టార్గెట్ అధికారులే.

సమావేశం ఏదైనా జిల్లా అటవీశాఖ అధికారులను టార్గెట్ చేస్తూ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు మాట్లాడడం పరిపాటిగానే మారింది. జూన్ 26న ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యటన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్ష సమావేశం, ఆ మరుసటి రోజు ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఆదివాసీల సమావేశాల్లోనూ అటవిశాఖ అధికారులను హెచ్చరించడం కనిపించింది. అటవీ శాఖ అధికారుల తీరుతోనే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఘాటు విమర్శలు చేశారు. కవ్వాల్ అభయారణ్యంలో అడ్డగోలుగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇటీవల ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కొత్తరేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలోను అటవి శాఖ అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. అటవీ శాఖ అధికారులకు నచ్చచెప్పి వారిని దారిలో పెట్టాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందని సభావేదిక పైననే మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది.

వేధిస్తే తిరుగుబాటే..

పోడు రైతులు, ఆదివాసీలను వేధిస్తే అటవీశాఖ అధికారులపై తిరుగుబాటు తప్పదంటూ హెచ్చరించడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల సిరిచెల్మ రేంజ్ పరిధిలోని కేశవపట్నం గ్రామంలో జరిగిన దాడి ఘటనలే మళ్లీ పునరావృతమయ్యే అవకాశం ఉందని, అలాగే భౌతిక దాడులకు సైతం వెనుకాడేది లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదంగా మారుతున్నాయి.అధికారులే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. గత కొద్ది రోజులుగా ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అధికారిక కార్యక్రమాల్లో అటవిశాఖ అధికారుల పైననే విమర్శలు చేస్తూ వస్తున్నారు. అయిన అధికారులు ఎమ్మెల్యే వ్యాఖ్యలపై స్పందించినట్లు కనిపించడం లేదు.అదే విధంగా వివరణ కూడా ఇచ్చే ప్రయత్నం చేయక పోవడంతో ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యల పై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమన్వయంతో ముందుకెళ్తేనే..

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్తేనే అభివృద్ధి సాధ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటవీ (మిగతా 6లో..)

ప్రజలను ఇబ్బందులు పెడితే సహించబోం

• వెడ్మ బొజ్జు (ఖానాపూర్ ఎమ్మెల్యే)



అటవీ చట్టాలు కవ్వాల్ టైగర్ జోన్ పేరిట ప్రజలను ఇబ్బందులు పెడితే సహించం. ఖానాపూర్ నియోజకవర్గంలో అటవీ శాఖ అధికారులు ప్రజలను ఇబ్బందులు పెట్టడమే ఏజెండాగా పెట్టుకున్నారు. కవ్వాల్ టైగర్ జోన్ సరిహద్దుల నుంచి 15 కి.మీల వరకు బఫర్‌జోన్‌గా గుర్తిస్తున్నారు. దీంతో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. 40 ఏళ్లుగా పోడు భూముల్లో పంటలను సాగు చేసుకుంటున్న వారిని ఉన్నట్టుండి వెళ్లిపోమంటే తిరుగుబాటు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. అడవులను రక్షించేందుకు అన్నిరకాలుగా సహకరిస్తున్నా అటవీశాఖ అధికారులు ఆదివాసీ గిరిజన గ్రామాలపై కుట్రలు చేయడంతోనే వివాదాలు తీవ్ర రూపం దాల్చుతుంది.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, అధికారులు

ఉట్నూర్‌లో అంతర్జాతీయ పులుల దినోత్సవం

ఉట్నూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలోని అటవీశాఖ అధికారులు ఉద్యోగులు మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి పులులను సంరక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉట్నూర్, బీర్సాయిపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు శిలానంద్, అరుణలు, డీఆర్‌ఓ ప్రియాంక, ఫారెస్టు సెక్షన్‌ఆఫీసర్లు గోపాల్‌నాయక్, ప్రేమ్‌సింగ్, సుదర్శన్, లచ్చన్నలతో పాటు ఫారెస్టు బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నకిలీ ఆయుర్వేద మందులు విక్రయిస్తున్న ముఠా అరెస్టు

- కర్నాటకకు చెందిన ఎనిమిది మంది నిందితులు అదుపులోకి
- ప్రధాన సూత్రధారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు: ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్నవారి బలహీనతను ఆసరాగా చేసుకుని ఆయుర్వేదిక్ మందుల పేరుతో నకిలీ మూలికలను అందిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని పట్టణంలో సాయిఆయుర్వేదిక్ మందుల దుకాణం పేరుతో ముఠా నిర్వహిస్తున్న అక్రమాలపై వివరాలను వెల్లడించారు. ఆస్పత్రుల వద్ద వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆయుర్వేద బాబా ద్వారా అనారోగ్య సమస్యలను నయం చేస్తామని నమ్మిస్తూ నకిలీ మూలికలు ఇస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో ప్రధాన సూత్రధారి అయిన కుమార్ అలియాస్ బాబా ప్రస్తుతం పరారీలో ఉన్నారని, మిగిలిన ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఒక గ్రాము నకిలీ మూలికలకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకున్నారని పేర్కొన్నారు. నిందితులంతా కర్ణాటక రాష్ట్రానికి చెందినవారని, ఇదివరకే పలు జిల్లాల్లో వీరు మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. ప్రధాన నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేకబృందం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కీలక నిందితుడు మిగిలిన 8మందికి నకిలీపేర్లతో మొబైల్‌ఫోన్‌లు, సిం కార్డులు ఇచ్చారన్నారు. ప్రజలను మోసం చేసిన నగదును సమానంగా పంచుకునేవారని పేర్కొన్నారు. ముఠా సభ్యులను పట్టుకున్న ఆదిలాబాద్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునీల్ కుమార్, ఎస్సై నాగనాథ్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు బి.సునీల్ కుమార్, సిహెచ్. కరుణాకర్‌రావు, కె.స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

అసాంఘిక చర్యల నియంత్రణకు చర్యలు

పట్టణంలో నేరాల అదుపుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి, ప్రతినిత్యం గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఉమెన్ పోలీస్‌స్టేషన్, ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. రికార్డులను పరిశీలించి.. ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ప్రతి వార్డుకు పోలీసు అధికారిని కేటాయించి వీ.పీ.వో విధానాన్ని అమలు చేయాలన్నారు. రాత్రి వేళల్లో మరింత పటిష్ఠంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల అదుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కరుణాకర్‌రావు, ఉమెన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



జిల్లాకేంద్రంలో పాము పుట్ట వద్ద పూజ చేస్తున్న మహిళలు



ఉట్నూర్‌లో నాగశేషునికి పూజలు చేస్తున్న భక్తులు



తాంసిలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

ఘనంగా నాగుల పంచమి

- భక్తిశ్రద్ధలతో నాగదేవతకు పూజలు చేసిన మహిళలు

నాగుల పంచమి వేడుకలు ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణ మాసంలోని శుక్లపక్ష పంచమిని పురస్కరించుకుని నాగదేవతకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఆదిలాబాద్‌టౌన్, జూలై29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో పాము పుట్టల వద్ద మహిళలు పూజలు చేసి, నాగ దేవతను వేడుకున్నారు. పాము పుట్టల వద్ద మహిళలు పాలు పోసి, పూజలను నిర్వహించారు. ముఖ్యంగా డైట్ మైదానం, గాంధీ పార్క్, మహిళా డిగ్రీ కళాశాల తదితర ప్రాంతాల్లో మహిళలు పూజలు చేశారు.

ఉట్నూర్: ఉట్నూర్ మండలంలోని హనుమాన్ మందిరం ఆలయ సమీపంలోని నాగశేషునిక భక్తులు భక్తిశ్రద్ధలతో పూజ లు నిర్వహించారు. అలాగే ఎల్లమ్మ చెరువు సమీపంలో ఉన్న నాగశేషుని ఆలయంలో భక్తులు చేరుకుని పూజలు నిర్వహించారు. లంబాడి తండాలలో ఉయలలు కట్టి ఆనందోత్సవాలు నిర్వహించుకున్నారు.

గుడిహత్నూర్: మండలంలోని అన్ని గ్రావల్లో నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. మండలంలోని మచ్చాపూర్ మూర్తి రాములు, దామన్ గూడలో నాగోబా ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. మచ్చాపూర్ మూర్తి రాములు నాగోబా ఆలయాన్ని ఎమ్మెల్యే అనీల్ జాదవ్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుడిహత్నూర్ పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, మాజీఎంపీపీ కేంద్రే జ్ఞానోభా,ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమల్ గౌడ్, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం మండల కేంద్రంలోని శివాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం బోథ్ ఎక్స్ రోడ్‌లో ఉన్న పురాతన పుట్ట వద్ద పాలుపోసి పూజలు చేశారు. సంప్రదాయాలను పాటిస్తూ పుట్టల వద్ద పూజలు చేయడం మన సంస్కృతిచ సంప్రదాయాల్లో భాగమని ఆయన పేర్కొన్నారు.

తలమడుగు: మండలంలో నాగుల పంచమి వేడుకలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పాముల పుట్ట వద్దకు వెళ్లి పంచామృతంతో, పాము పుట్టలో పాలుపోశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు సునీతారెడ్డి పలువురు తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలో నాగుల పంచమి పండుగ వేడుకలను జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్ర సాంప్రదాయం ప్రకారం బజార్‌హత్నూర్, దిగ్నూర్, గంగాపూర్, బోస్రా తదితర గ్రామాల్లో అన్నదమ్ముల కళ్లను పాలతో కడిగిన అక్కా చెల్లికి తోబుట్టువుగా అన్నావాయితి ప్రకారం కట్నకానుకలు సమర్పించారు. అనంతరం గ్రామాల్లో కట్టెలతో ఏర్పాటు చేసిన ఊయలలో ఊగుతూ మహిళలు పల్లె పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ పండుగతో అంతటా సందగి వాతావరణం నెలకొంది.

బోథ్: మండలంలో నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టల్లో పాలు పోసేందుకు మహిళలు మొక్కుల వద్ద బారులు తీరారు. ఇంటిల్లిపాది పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు.

తాంసి: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయా గ్రామాల్లో పుట్టలో పాలు పోసి మొక్కలు తీర్చుకున్నారు. ఉదయం నుంచి పుట్టల వద్దకు మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. మంగళహారతులు, పాలు, పండ్లు, నవధాన్యాలను తీసుకొని వెళ్లి పుట్టలో పాలు పోసి నవ ధాన్యాలను సమర్పించారు. పిల్లాపాపలకు ఎలాంటి హాని కలిగించకుండా చూడాలంటూ నాగదేవతను వేడుకున్నారు. ఈ నాగుల చవితిని పురస్కరించుకొని ఆలయాలు కూడా సందడిగా కనిపించాయి.

ఇచ్చోడ: మండలవ్యాప్తంగా నాగులపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ సమీపంలోని పుట్టలో మంగళవారం మహిళలు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలో ఊయలలు కట్టి ఊగుతూ ఆనందోత్సాహల మధ్య పండుగను జరుపుకున్నారు.



బోథ్‌లో పుట్టల వద్ద పూజలు చేస్తున్న మహిళలు



మచ్చపూర్‌లో ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్మెల్యే

రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

జైనథ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందిస్తున్న సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జైనథ్‌లో గల లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఆహార భద్రత కార్డుల పంపిణీకి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు రైతు భరోసా పథకం ద్వారా అందించే డబ్బుల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలని కోరారు. విద్యా, వైద్యం ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ పార్టీలు ఏవైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను లబ్ధిదారులకు చేరేవిధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి ఆదిలాబాద్ ఆర్డీఓ స్రవంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జైనథ్‌సొసైటీ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, జైనథ్‌మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ అడ్డిరూకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సరిపడా యూరియాను అందించాలి



యూరియా నిల్వల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

భీంపూర్: రైతులకు సరిపడా యూరియాను అందించాలని వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు రికార్డు నమోదు చేయాలని కలెక్టర్ రాజార్షిషా ఆదేశించారు. మంగళవారం భీంపూర్‌లో యూరియా నిల్వలు తనిఖీ చేసిన కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. మండలానికి అదనపు స్టాక్ ఇవ్వాలని రైతులు గోవర్ధన్ యాదవ్, మడావి లింబాజీ, బక్కి కపిల్, రవీందర్ జాదవ్, బొంత నితిన్‌లు కోరారు.

బీజేపీలో పలువురి చేరిక

ఆదిలాబాద్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాత్నాల మండలం ఖార గ్రామానికి చెందిన పటేల్ తో పాటు పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోతురాజు రమేష్, సుభాష్, సురేష్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం

బోథ్, జూలై29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామంలో మంగళవారం మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మునిగేల ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా భీమా ఈశ్వర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్, జూలై29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలలో పీజీ సీఆర్టీ గణితం బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక అధికారి రాథోడ్ లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ గణితంతో పాటు బీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగం కేవలం పార్ట్‌టైమ్ మాత్రమేనని తెలిపారు.

పులులపై విద్యార్థినులకు అవగాహన

తలమడుగు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థి జాతీయమృగం పులుల పట్ల అవగాహన ఉండాలని వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని ఉమ్రిలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అడవుల నరికివేత కారణంగా పులులు సంఖ్య తగ్గిపోతోందని, అడవులను కాపాడుకోవాలని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'ఏజెన్సీ ఏరియా పోస్టులకు మినహాయింపు ఇవ్వాలి'

ఉట్నూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ఏరియా పోస్టులకు మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి దినేష్ చౌహాన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాబోయే స్కూల్‌అసిస్టెంట్, పీజీ హెడ్ మాస్టర్ క్యాడర్ ప్రమోషన్లలో గతంలో జీవో3 ద్వారా ఏజెన్సీ ఏరియా పోస్టులకు 100 శాతం గిరిజన అభ్యర్థుల ద్వారా జరిగిన నియమకాలను కూడా ఎస్టీ అడ్వకసి పోస్టులుగా పరిగణించడం రాజ్యాంగ విరుద్ధమని ఏజెన్సీ ఏరియా పోస్టులకు సడలింపు ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహృదయంతో పునరాలోచించి గిరిజనులు నష్టపోకుండా వారి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నేరడిగొండ, జూలై29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు నేరడిగొండ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజుల తండా గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య సంబంధిత విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఆశా కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

బీమా పాలసీలు తప్పనిసరిగా తీసుకోవాలి



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ వృత్తిలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదని, కుటుంబం బాగుండాలంటే ప్రమాద బీమా పాలసీలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గతంలో లైట్ మోటర్ వెహికల్ అసోసియేషన్ కోరిక మేరకు డ్రైవర్లకు పోస్టాఫీసు ద్వారా ఏమ్మెయే ప్రమాద పాలసీ చేయించారు. కాగా సంవత్సరం క్రితం పిప్పల్ కోటికి చెందిన పెద్దింటి ప్రభాకర్ పాముకాటుతో మృతి చెందగా.. అతనికి మంజూరైన రూ.10 లక్షల చెక్కును అధికారులతో కలిసి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం నాయకులు విఠల్ గౌడ్, వసంత్, మోహన్, శంకర్, రమేష్, అశోక్ స్వామి, బీజేపీ నాయకులు విజయ్, మయూర్ చంద్ర, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

తలమడుగు , జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ఆగస్టు 1న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తలమడుగు ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి వెంకట్‌రావు చేతుల మీదుగా కరపత్రం విడుదల చేశారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.శంకర్, మండల బాధ్యులు రమేష్, మురళిలు పాల్గొన్నారు.

'మందులు సక్రమంగా ఉండేలా చూడాలి'



అంబులెన్స్ సిబ్బందితో ప్రాజెక్టు మేనేజర్ సామ్రాట్

ఇచ్చోడ, జులై 29 (ఆంధ్రజ్యోతి) : అత్యవసరంలో రోగులను సకాలంలో ఆసుపత్రికి చేర్చే ముందు ప్రథమ చికిత్స అందించేలా చూడాలని అంబులెన్స్ ప్రాజెక్టు మెనేజర్ సామ్రాట్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ అవరణలో నిలిపి ఉన్న 108, 102 వాహనాలను ఆయన తనిఖీ చేశారు. వాహనాలల్లో ఉన్న పరికరాలు, వాటి పనితీరును పరిశీలించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. గడువు ముగిసిన మందులను ఎప్పటికప్పుడు తీసివేయాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఈఎమ్‌టీ రాకేష్, రాజశేఖర్, ఫైలెట్ వినోద్ పవర్‌బాబు పాల్గొన్నారు

బురద రోడ్డు మరమ్మతు చేయించిన సీఐ



గుంతలు పడ్డ రోడ్డు పనులు చేయిస్తున్న సీఐ

నార్నూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గంగాపూర్ నుంచి తాడిహాత్నూర్ మధ్యలో ఉన్న రోడ్డు బ్రిడ్జి చుట్టూ పక్కల గుంతలు పడి వర్షపు నీరు ఆగి ఉండడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ప్రయాణికులు ఇబ్బంది పడతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ పి.ప్రభాకర్ ప్రాంత ప్రదేశానికి వెళ్లి దగ్గర ఉండి జేసీబీ ద్వారా మట్టి మొరం పోయించి గుంతలు లేకుండా రోడ్డు బాగు చేయించారు. విషయంపై సర్వత్ర ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఆటోలో ప్రయాణించే వారి పట్ల జాగ్రత్త వహించాలని సీఐ పి.ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం వద్ద స్థానిక ఆటో డ్రైవర్లతో మాట్లాడి ప్రయాణం చేసే ప్రజలు వారి జాగ్రత్త పట్ల పలు సలహా సూచనలు ఇచ్చారు. ప్రతి ఆటోకి సేఫ్టి స్టిక్కర్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై కె.అఖిల , ఆటో యూనియన్ మండల అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్, డ్రైవర్‌లు పాల్గొన్నారు.

పల్లె సౌందర్యం..



దస్తురాబాద్ మండల కేంద్రంలో దూరంగా ఉన్న ఈ కొండలు వర్షాకాలం ముసురుకుంటూ, పచ్చదనాన్ని చిలికిస్తూ ప్రకృతి అందంగా ఉంది.

దస్తురాబాద్

ప్రమాద జీవనం..



సారంగాపూర్ మండలంలోని పెందలాదారి ఇప్ప చెలమే తండ వాసులకు ప్రమాదమని తెలిసి కూడా వరద నీటిలో నుంచే వెళ్లాల్లిన పరిస్థితి. వాహనాలపై కాలినడకన ఒక్కరి సహాయంతో ఒక్కరు ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ఇతర గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు.

- సారంగాపూర్

శిక్షణ సంస్థలో దరఖాస్తు చేసుకోండి

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

ఉట్నూర్, జూలై29 (ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ గిరిజన పారిశ్రామిక శిక్షణ సం స్థలో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా కోరారు. ఈమేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయం చాంబర్‌లో 2025 అడ్మిషన్ల ప్రచార కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ ఐటీఐ - అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), ప్రవేశాల కోసం రూపొందించిన ఏటీసీ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత నూతన సాంకేతిక విద్యలో నైపుణ్యం పెంచుకోవడానికి ప్రస్తుత పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండే కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు పొందడానికి ఏటీసీ వంటి ఆధునిక శిక్షణ కేంద్రాల ద్వారానే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. పోస్టర్లు పాంప్లెట్లు ద్వారా గ్రామీణ యువతకు, తల్లిదండ్రులు, విద్యార్థులకు ఏటీసీ ప్రవేశాల పై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ప్రచారం చేపట్టా మన్నారు. ఏటీసీలు అందుబాటులో ఇంకా సాంకేతికంగా ప్రావీణ్యం కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.అభ్యర్థులు మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు అన్నారు. దరఖాస్తులను ఈ నెల 31లోగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, టీచింగ్ సిబ్బం ది పాల్గొన్నారు.

ఘనంగా నాగపంచమి



చించాలలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



తానూర్‌లో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మామడ/తానూర్/కుబీర్/ముథోల్/నిర్మల్‌రూరల్ జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నాగమ్మ తల్లి చల్లగా చూడు అంటూ మంగళవారం రోజున నాగుల పంచమి సందర్భంగా మహిళలు, భక్తులు తెల్లవారి నుండి శివాలయాల్లో నాగమ్మ ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆవు పాలతో జొన్న పేలాలతో నాగమ్మకు సమర్పించారు. నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్కా చెల్లెళ్లు అన్నా తమ్ముళ్లకు ఆవు పాలతో కళ్లను కడిగారు. నాగ పంచమి విశిష్టతను తెలుసుకున్నారు. మండలంలోని నల్లుర్తి, పొన్కల్ నాగమ్మ ఆలయాల్లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తానూర్ : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నామ పంచమి వేడుకలను మహిళలు జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నాగదేవునికి ప్రత్యేక పూజలు చేసి పాలాభిషేకం చేశారు. పుట్టలో పాలు మొక్కులు తీర్చుకున్నారు. పుట్టింటి ఆడపడుచులు తమ సోదరులకు పాలతో కండ్లను కడిగారు. సోదరులకు తీపి పదార్థాలను తినిపించి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర ఆలయంలో గల నాగమ్మ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ముథోల్ : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని చించాల, తరోడ, ఎడ్‌బిడ్, చింతకుంట, ఆష్టా, విట్టోలి, తదితర గ్రామాల్లో మంగళవారం నాలుగు పంచమి వేడుకలను భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు నాగదేవతలకు కొబ్బెరి, బెల్లంతో పాలు పోసి పూజలు నిర్వహించారు. పుట్ట వద్ద, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అక్కా చెల్లెళ్లు అన్న దమ్ములకు ఆవు పాలతో కళ్లు కడిగి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తోబుట్టువులకు సోదరులు కానుకలు సమర్పించారు. తోబుట్టువుల రాకతో ఇళ్లలో ప్రేమానుమారాగాలు వెల్లివిరిశాయి.

నిర్మల్ రూరల్ : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్మల్ నగరం ఆధ్వర్యంలో మంగళవారం బంగల్‌పేట్, బుధవార్‌పేట్, ద్యాగవాడ, బోయివాడ, ప్రియదర్శి నగర్ బస్తీలలో ఆవు పాలు పంపిణీ చేసినట్లు నగర కార్యవాహ కిన్నెర్ల రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవాహ కిన్నెర్ల రవి, గోసేవ ప్రముఖ్ అల్లం దేవిదాస్, మధుకర్ పట్వార్, పుట్టి ప్రశాంత్, ఎం. గణేష్, గన్నేరి ప్రభు, ఖైసర్ల వెంకట రమణ పాల్గొన్నారు.



ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆవు పాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



నిర్మల్‌లో..

ముదురుతున్న వివాదం

(5వ పేజీతరువాయి)

చట్టాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న అధికారుల తీరును తప్పుబట్టడం ఏమిటన్న వాదనలు వినిపిస్తున్నాయి. అదే విధంగా మానవతా దృక్పతంతో అటవి శాఖ అధికారులు వ్యవహరించడం లేదన్న విమర్శలు లేకపోలేదు. అటవి చట్టాల పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తే కొంత వరకు వివాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు,ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. కాని జిల్లాలో దీనికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎవరికి వారే ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రజల సమస్యలు పరిష్కారంకాక పోవడంతో అయోమయ పరిస్థితులకు దారి తీస్తుంది. ఇప్పటికి ఏజెన్సీలో చాలా గ్రామాలకు కనీస రోడ్డు మార్గాలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసర సమయంలో వైద్యం అందక ఎందరో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఏజెన్సీ చట్టాలను పరిగణలోకి తీసుకోకుండా అటవి చట్టాలను అమలు చేయడమే అసలు సమస్యకు ప్రధాన కారణంగా మారుతుంది.

కుమారి ఆశ్రమంలో శ్రావణపూజలు



భజన సంకీర్తనలు చేస్తున్న నిర్వాహకులు, గ్రామస్తులు

నేరడిగొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారి గ్రామంలో గల శ్రీ గురుదేవ సేవ ఆశ్రమంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్రమ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు కలిసి ఆశ్రమంలో అఖండ జ్యోతిని వెలిగించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. ఆశ్రమంలో శ్రావణ మాసం చివరి వరకు ప్రతిరోజూ పూజ కార్యక్రమాలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'రాజీవ్ గాంధీ అధికార వికేంద్రీకరణ రూపశిల్పి'



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సుభాష్ యాకరన్

నిర్మల్‌టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ పంచాయతీ రాజ్ వ్యవస్థ, అధికారి వికేంద్రీకరణకు నిజమైన రూపశిల్పి మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ అని ఆర్‌జీపీఆర్‌ఎస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సుభాష్ యాకరన్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లాకేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జరిగిన సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధుల విలువను, స్థానిక సంస్థలకు రాజ్యాంగపరంగా హక్కులు కల్పించిందన్నారు. గ్రామీణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిస్వార్థంగా పనిచేస్తుందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి నాయకులుగా, కార్యకర్తలు ఎదగాలన్నారు. కార్యక్రమంలో నిర్మల్, ముథోల్ నియోజకవర్గ ముఖ్యనాయకులు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడేగజేందర్, నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, చిన్ను, అబ్దుల్ హాది, సాధ సుదర్శన్, రామేశ్వర్ రెడ్డి, రఘునందన్ రెడ్డి, కేశం రమేష్, వాజీద్ అహ్మద్ ఖాన్, కుంట వేణుగోపాల్, సాగర్ రెడ్డి, పాల్దే అనిల్, బొల్లోజి నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, మొహినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి



కృష్ణ మృతదేహం

పెంబి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై పురుగుల మందు తాగి మెస్రం కృష్ణ(31) మృతి చెందిన సంఘటన మండలంలోని జంగుగూడ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై హనుమండ్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జంగుగూడ గ్రామానికి చెందిన కృష్ణ మద్యానికి బానిసై, ఏ పని చేయకపోవడంతో తన భార్య గీత మందలించడంతో మనస్తాపానికి గురై, జీవితం మీద విరక్తి చెందిన సోమవారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్‌ల పంపిణీ



రెయిన్ కోట్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఖానాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న 20 మందికి రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ కమీషనర్ సుందర్ సింగ్, ఖానాపూర్ మున్సిపాలిటీ సిబ్బంది సురేందర్, ఫిరోజ్, శంకర్, చేతన్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు

ఘనంగా నవగ్రహాల ప్రతిష్ఠాపన



యాగము నిర్వహిస్తున్న పండితులు

బాసర, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం ఆధ్వర్యంలో గోదావరి నది తీరంలో గల సూర్యశ్వర శివాలయ ప్రాంగనంలో నవగ్రహ దేవతామూర్తుల పునఃప్రతిష్ఠపన మహోత్సవం ఘనంగా ప్రారంభం అయింది. స్థాపిత దేవతాపూజలు, జలాధిసము, మహాస్వప్నము, ధాన్యాదివాసము ఫల, పుష్పాదివాసము, శయ్యాధివాసములు, నవగ్రహ మూల మంత్ర అదివాసాంగ హోమములు, నవగ్రహ మూల మంత్ర పుష్పం తీర్థప్రసాద వితరణ వంటి పూజా కార్యక్రమముల దేవస్థాన స్థానాచార్యులు ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ఆలయ వైదిక బృందం నిర్వహించారు. ఈ పూజలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యనిర్వాహణాధికారి సుదర్శన్‌గౌడ్, పర్యావేక్షకులు శివరాజ్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దపులుల సంరక్షణను బాధ్యతగా భావించాలి

● ఖానాపూర్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవో శివకుమార్

ఖానాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దపులుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఖానాపూర్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవో శివ కుమార్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ అటవీ శాఖ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో, మస్కాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. పెద్దపులుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఖానాపూర్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ వేర్వేరు కార్యక్రమాలలో ఖానాపూర్ ఎఫ్‌ఆర్‌వో కిరణ్ కుమార్, ఎఫ్‌ఎస్‌వో కుతుబుద్దీన్, మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రావు, కేటీఎస్ స్కూల్ కరస్పాండెంట్ గాండ్ల శ్రీనివాస్, తదితరులున్నారు.

ముగ్గురు ఉద్యోగులకు ఉత్తమ ప్రతిభా పురస్కారం...

అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వన్యప్రాణి సంరక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అటవీ శాఖ ఖానాపూర్ డివిజన్ పరిధిలోని ముగ్గురు ఉద్యోగులకు ఉత్తమ ప్రతిభా పురస్కారం అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎఫ్‌ఎస్‌వో రవీందర్‌కు నాగపూర్ ఎఫ్‌బీవో సయ్యద్ మోహిద్, తాటిగూడ బేస్ క్యాంప్ వాచర్ మధుకర్‌లకు ఉత్తమ ప్రతిభా పురస్కారం అవార్డులు దక్కాయి. మంగళవారం హైదరాబాద్‌లోని దూలపల్లి తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో పీసీసీఎఫ్ సువర్ణ చేతుల మీదుగా అటవీ శాఖ ఉద్యోగులు ప్రతిభాపురస్కారాలను అందుకున్నారు.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎఫ్‌డీవో శివకుమార్

కడెం : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం కడెం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆశ్రమ స్కూల్ విద్యార్థులతో కలిసి అటవీ అధికారులు సేవ్ ద టైగర్ సేవ్ ద నేషన్ అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి పరిరక్షణలో పులుల ప్రాముఖ్యతపై ఎఫ్‌ఆర్‌వో గీతారాణి వివరించారు. పులులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు సిద్ధార్థ, ప్రకాష్, రవి, నోమానుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : అంతర్జాతీయ పెద్ద పులుల సంరక్షణ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో అటవీ శాఖ అధికారులు మంగళవారం నిర్వహించారు. అధికారులు, పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పులుల సంరక్షణ అడవుల రక్షణపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు ఎఫ్‌ఆర్‌వో జీవీ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వోలు టి. శ్రీనివాసరావు, అరుణ్ కుమార్, రాజేంద్ర కుమార్, ఏవో ఎండీ నజీర్‌ఖాన్, వి. సంతోష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

పెంబి : మండల కేంద్రంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పెంబి అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీవైఆర్‌వో ప్రతాప్ నాయక్ మాట్లాడుతూ... పులుల ఆవశ్యకత, వాటి మనుగడ, అటవీని కాపాడుట, వన్యప్రాణి సంరక్షణ మన అందరి చేతిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామచందర్, యూపీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు జైసింగ్, డీవైఆర్‌వో ప్రతాప్ నాయక్, గీత, ఎఫ్‌ఎస్‌వో హైందవి, గంగారాం, సుందర్, స్రవంతి, శ్రీనివాస్, నరేష్, లాలాజీఉన్నారు.



నాగోబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రంగుల రట్నాలు వద్ద యువతి, యువకుల సందడి

కిక్కిరిసిన కేస్లాపూర్

» నాగోబా ఆలయానికి పోటెత్తిన భక్తజనం

» ఆదివాసీ సంప్రదాయంతో పంచమి పూజలు



నాగోబాను దర్శించుకున్న మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు

ఇంద్రవెల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగుల పంచమి పండుగ సందర్భంగా ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పం డుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబాను దర్శించుకునేందుకు మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నాగోబా దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలిరావడంతో కెస్లాపూర్ నాగోబా ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం కిక్కిరిశాయి. నాగోబా దర్శనం కోసం భక్తులు క్యూలో నిలబడి నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా ఆలయ ప్రాంగణం లో దారి పొడవునా వెలిసిన దుకాణాలు, హోటళ్ల వద్ద పిల్ల ల ఆటబొమ్మలు, తినుబండారాలు కొనుగోలు చేస్తూ జనం రద్దీ కనిపించింది. రంగుల రాట్నాలు వద్ద యవతి, యువకు లు సందడి చేశారు. నాగుల పంచమి పూజలు బుధవారం వరకు కొనసాగుతాయని నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్ తెలిపారు. నాగుల పంచమి సం దర్భంగా నాగోబా దేవతను దర్శించుకున్న వారిలో మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు, గోండ్వానా రాయిసెంటర్ జిల్లా మేడీ మెస్రం దుర్గు పటేల్, ఆలయ కమిటీ ఛైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముఖడే ఉత్తం, తదితరులున్నారు.

ఆదివాసీ సంప్రదాయ అన్నదానం

మెస్రం వంశీయులు నాగుల పంచమి పండుగ సందర్భంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో వండిన జొన్న గట్కా, సాంబార్‌ను వారి ఆచారం ప్రకారం మోదుగ ఆకుల్లో నాగోబా దర్శనం కోసం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పోలీసు బందోబస్తు

కేస్లాపూర్ నాగోబా ఆలయంలో పూజలకు వచ్చే భక్తులకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగోబాను దర్శించుకున్న ఎస్పీ ఏఎస్పీ

ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహజన్ ఐపీఎస్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌లో నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ కమిటీ మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో వారిని శాలువాలతో సన్మానించారు.

వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

● టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న కమిషనర్ అజయ్‌కుమార్

ఉట్నూర్, జూలై29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రానున్న మూడు నెలల్లో వ్యాధులను అధిగమించడానికి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్ ఆడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జైనూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి పరిశీలించిన అనంతరం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేశారు. వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి గిరిజన ప్రాంతాల నుంచి వైద్యం కోసం ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో గతంలోని పరిస్థితులను పోల్చిచూస్తే ఈ వర్షాకాలంలో వ్యాధులు అదుపులోనే ఉన్నాయని చెప్పారు. వ్యాధుల నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి డాక్టర్లను సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కావాల్సిన మందులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉట్నూర్ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా సిబ్బంది నియామకం జరుగడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఏజెన్సీ ప్రాంతాలలో పని చేయడానికి నోటిఫికేషన్లు ఇచ్చిన డాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. దీని కోసం ఏజెన్సీ ప్రాంతాలలో పని చేసే డాక్టర్లకు 50శాతం వేతనం అదికంగా ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించామని ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే అది అదనపు జీతం చెల్లించడం ద్వారా డాక్టర్ల నియామకం చేపట్టవచ్చని అన్నారు. ఆసుపత్రిలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్‌బొంకంటి, రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి మహేశ్‌రెడ్డిలు కమిషనర్‌ను కలిసి వేతనాలు ఇవ్వాలని కోరడంతో త్వరలోనే ఇస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ ఈఈ శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాదవ్‌ఉపేందర్, ఆర్ఎంఓలు డాక్టర్ మహేందర్, డాక్టర్ కపిల్‌లతో పాటు డాక్టర్ మాలతిరెడ్డి, డాక్టర్ మమత, డాక్టర్ శ్వేత, డాక్టర్ విక్రమ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రతిమ తదితరులు ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కమిషనర్ అజయ్‌కుమార్



రహదారిపై కప్పేసిన పొగమంచు

ఆదిలాబాద్‌లో 'స్నో'యగాలు

» అడవులను కప్పేస్తున్న దట్టమైన పొగమంచు

ఆదిలాబాద్, జూలై29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాశ్మీర్‌గా పిలిచే ఆదిలాబాద్‌లో ప్రకృతి అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వానాకాల సీజన్‌లో ఎటుచూసినా పచ్చనికొండలు, కొనలే దర్శనమిస్తున్నాయి. పచ్చదనంతో పరుచుకున్న అడవుల పై దట్టమైన పొగమంచు కప్పేయడంతో మరో కాశ్మీర్‌లో ఉన్నామనే అనుభూతి కలుగుతుంది. మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో కురిసిన వర్షానికి నిర్మల్ - ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న మహబూబ్ ఘాట్స్‌పై దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. హెడ్‌లైట్ వెలుగులతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ దృశ్యాలను చూసిన వారంతా ఆదిలాబాద్ మరో కాశ్మీర్‌లా మారిపోయిందంటూ మాట్లాడుకోవడం కనిపించింది.



హెడ్‌లైట్ వెలుగులతో ముందుకు వెళ్తున్న వాహనం



అందరి ఐక్యతతోనే
నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం

● రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిల్ జాదవ్

భీంపూర్, జూలై29 (ఆంధ్రజ్యోతి): పార్టీలు ఏవైనా సరే అందరి ఐక్యతతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆయన మంగళవారం భీంపూర్ మండలకేంద్రంలోని రైతువేదికలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామల దేవిలతో కలిసి రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం ముగిసిన తర్వాత కరంజి, గుబిడి గ్రామ రోడ్లను బీటీగా మారుస్తామన్నారు. సరిహద్దున ఉన్న గొల్లగాడ్, తంసి (కే) గ్రామాల వరకు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రేషన్ బియ్యం ఉపయోగించని వారు కార్డు తీసుకుని ప్రయోజనం లేదని, ప్రభుత్వం ఏదైనా రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని సూచించారు. అధికారులు మరింత శ్రద్ధగా పని చేస్తే పేదలకు సంక్షేమఫలాలు అందుతాయన్నారు. పొలంబాట తదితర రోడ్డు పనులకు మొరం మట్టి పోసే క్రమంలో పోలీసులు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పగా కలెక్టర్ సంబంధిత పంచాయతీరాజ్ ఈఈ శివరామ్‌కు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అమ్ముకోవద్దని, ఎవరైనా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ఆత్మ ఛైర్మన్ కామన్ అశోక్, ఆర్డీవో స్రవంతి, డీఎస్‌వో వాజీద్ అలీ, తహసీల్దార్ నలంద ప్రియ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ కుందా సుధాకర్, మాజీ ఎంపీపీ కుడిమేత సంతోష్, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు అన్న పటేల్, దేవరెడ్డి, దాసరి రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మండలంలోని వాడగాంలో మంగళవారం వివిధ పార్టీలకు చెందిన వంద మంది కార్యకర్తలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారిని పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు.



సోనాలలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న తహసీల్దార్

సోనాలలో ఎరువుల దుకాణాల తనిఖీ

బోథ్, జూలై29 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం సోనాల తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తనిఖీచేశారు. జిల్లా ఉన్నతాధికారి ఆదేశాల మేరకు షాపులను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నకిలీ పురుగుమందులను అమ్మవద్దని దుకాణాలలో స్టాక్ బుక్‌లను, బిల్ బుక్‌లను సరిగ్గా మెయింటెనెన్స్ చేయాలన్నారు. తప్పులు లేకుండా పుస్తక నిర్వహణ ఉండాలని వివరించారు. ఎరువులు కొనుగోలు చేసిన వ్యక్తులకు వ్యాపారులు బిల్లుల రసీదు తప్పకుండా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బోథ్ మండల వ్యవసాయ అధికారి రవితేజ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



బురదతో నిండిన జెండాగూడ రోడ్డు

చిత్తడిగా గ్రామీణ రోడ్లు

- ప్రమాదాలుకు గురవుతున్న వాహనదారులు
- అవస్థల్లో ప్రజలు

ఉట్నూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల రోడ్లు అన్నీ చిత్తడిగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా చెదురు ముదురుగా కురుస్తున్న వానలకు రోడ్లు బురదమయంగా మారడంతో కాలినడకన వెళ్లే ప్రజలతో పాటు ద్విచక్ర వాహనాల్లో ఆటోలలో వెళ్లే ప్రజలు నరకయాతన పడుతున్నారు.ఉట్నూర్ మండలంలోని పిట్లగూడెం నుంచి టక్కుగూడ వెళ్లే దార ంతా బురదమయంగా మారడంతో గ్రామీణ గిరిజనులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పిట్లగూడ గిరిజనులు ఉట్నూర్ వైపు వెళ్లాలంటే పిట్లగూడ దేవగూడ మధ్యలో ఉన్న లోలెవల్ వంతెన పైనున్న సిమెంట్ పూర్తిగా కొట్టుక పో వడంతో వాగు నీటిలో నుంచి వాహనాలు వెళ్లకపోవడంతో పిట్టగూడెం గిరిజనులు టక్కుగూడ వైపు వెళ్లి పెరిక గూడెం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. దంతనపల్లి నుంచి జెండాగూడ, చెరువు గూడెం, మొర్రిపేట వెళ్లే గిరిజనులకు బీటీ రోడ్డు కరువై పోవడంతో మొరం వేసిన రోడ్డు పైనే నడిచి వెళ్తున్నారు. వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది అవుతుండగా బురదలో నడవడానికి సైతం ఇబ్బందిగా ఉంద ని గిరిజనులు వాపోతున్నారు. షాంపూర్ నుం చి లక్కేటిపేట,కామాయిపేట తదితరర గ్రామాలకు వెళ్లే గిరిజనుల సైతం లక్కేటిపేట రోడ్డు పై బీటీ కొట్టుక పోవడంతో వేసిన మొరం వర్షాలకు బురదగా మారడంతో బురద నుంచి ప్రయాణించాల్సి వస్తుందని గిరిజనులు పేర్కొంటున్నారు.

- తప్పని అవస్థలు...

ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన తమ తలరాత మారడం లేదని గ్రామీణ గిరిజనులు పేర్కొంటున్నారు. ఉట్నూర్ మండలంలోని కన్నాపూర్, ఉమాపతికుంట, రాజులమడుగు, పాటగూడ, పిట్లగూడ, చెరువుగూడ, లక్కేటిపేట, బుర్రన్నగూడ, మొర్రిపేట్, చెరువుగూడ, జెండాగూడ గ్రామాల రోడ్లన్ని బీటీ చేయక పోవడంతో ప్రతియేటా వర్షాకాలంలో తమ గ్రామాల రోడ్లు అన్ని బురద బురదగా మారడంతో అవస్థలు పడుతున్నామని గిరిజనులు పేర్కొంటున్నారు. తమ గ్రామాల రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ తమ సమస్యలు పరిష్కరించడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల రోడ్లను బీటీ రోడ్లుగా మార్చి తమ కస్టాలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రాతిమత్తడి దూకుతున్నా.. రైతు చేను తడవలే!

» నిండుకుండలా మారిన సదర్మాట్

» ఇటీవల వర్షాలకు పురాతన ఆనకట్టకు జలకళ

» ఆయకట్టుకు నీటి విడుదల చేయని అధికారులు

» త్వరగా నీటి విడుదల చేస్తే పనులు

» ప్రారంభించుకుంటామని అంటున్న రైతులు



అతిపురాతనమైన సదర్మాట్ ఆనకట్ట



రాతి మత్తడి పైనుంచి గోదావరిలోకి దూకుతున్న నీరు

ఖానాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చుట్టూ పచ్చని చెట్లు ప్రశాంతమైన వాతావరణం, దట్టమైన అడవుల మధ్య నుంచి ముందుకు సాగే గోదావరి నదిపై 1891-92 నాటి ఫ్రెంచ్ ఇంజనీర్ జేజే బటాలేచే నిర్మితమైన అతిపురాతన సదర్మాట్ ఆనకట్ట ఇప్పుడు జలకళను సంతరించుకుంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండుకుండలా మారింది. సదర్మాట్ వద్ద గోదావరి నది ఆనకట్ట పైనుండి 1.5ఫీట్ల ఎత్తుతో ప్రవహిస్తోంది. దీంతో రాతి మత్తడి పై నుంచి గోదావరి నదిలోకి దూకుతున్న నీటి అందాలు అటుగా వచ్చిన వారికి కనువిందు చేస్తున్నాయి. సదర్మాట్‌కు జలకళ సంతరించుకోవడంతో రానున్న రోజుల్లో పర్యాటకుల తాకిడి భారీగా పెరగనుంది. ఇంతవరకు బాగానే ఉన్నా 134 ఏళ్ల చరిత్ర కలిగిన సదర్మాట్ ఎగువన ఎస్సారెస్పీ నిర్మించిన నాటి నుంచి సదర్మాట్ రైతాంగం నీటి కష్టాలను ఎదుర్కొంటుంది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నిర్మించిన పురాతన ఆనకట్ట సదర్మాట్‌కు ఎస్సారెస్పీ నిర్మాణ సమయంలో నేరుగా నీరుచ్చేందుకు రైపేరియన్ హక్కులను సైతం కల్పించినట్లు ఈ ప్రాంత రైతులు చెబుతారు. కానీ సదర్మాట్ రైతాంగం మాత్రం నేటికీ నీటి కోసం నిరీక్షిస్తూనే ఉండాల్సిన పరిస్థితి తలెత్తుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదర్మాట్ ఆనకట్ట నిర్మాణం చేసిన నాటి నుండి ఖానాపూర్, కడెం మండలాలలో సుమారు 18వేల పైచిలుకు ఎకరాలకు జీవనాధారంగా ఉంది. ఈ ఆనకట్టకు జీవం పోసేందుకు 7 కిలోమీటర్ల ఎగువన నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ పనులు పూర్తయితే కొంత మేరకు ఈ నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ విడుదల కాని నీరు..

ప్రస్తుతం వరి నాట్లు వేసేందుకు ఎప్పం దాటిపోతున్నా సదర్మాట్ ఆయకట్టుకు ఇంకా నీటి విడుదల కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువనున్న ఎస్సారెస్పీలో ఆశించినస్థాయిలో నీళ్లు లేకపోవడంతో సదర్మాట్‌కు ఇంకా నీటివిడుదల చేయలేదని అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సదర్మాట్ వద్ద నీరు రాత్రి మత్తడి పైనుంచి గోదావరిలోకి ప్రవహిస్తోంది. రాతి మత్తడి పైనుండి నీరు గోదావరిలోకి పోతున్నా రైతు చేనులోకి మాత్రం చుక్క నీరు చేరకపోవడంపై ఆందోళనకు గురవుతున్నారు. గత కొద్దిరోజుల క్రితమే సదర్మాట్ ఆనకట్ట లెవల్‌కి నీరు వచ్చినప్పుడే అధికారులు నీటి విడుదల చేసి ఉంటే ఇప్పటి వరకు ఆయ కట్టు రైతాంగం నార్లు పోసుకొని ఉండేవారని చెబుతున్నారు. గత మూడు రోజులుగా సదర్మాట్ వద్ద నీరు గోదావరిలోకి వృధాగా పోతున్న నేపథ్యంలో ఇప్పటికైనా సదర్మాట్ కాల్వకు నీటి విడుదల చేసి నార్లు పోసుకునేలా తమకు సహకరించాలని ఆయకట్టు రైతా ంగం కోరుతున్నారు. ఎస్సారెస్పీ నిండే వరకు వేచి ఉండకుండా వర్షం ద్వారా వస్తున్న గోదావరి నీటిని పంటలకు ఉపయోగ పడేందుకు సదర్మాట్ కాలువ ద్వారా విడుదల చేయాలని సదర్మాట్ రైతంగం కోరుతున్నారు.



సదర్మాట్ నీరందక ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కాని ఆయకట్టు భూములు

అన్ని అనుకూలిస్తే నేడు నీటి విడుదల



● నితిన్, సదర్మాట్ ఏఈఈ

గోదావరి ద్వారా వస్తున్న నీటిని ఆనకట్ట నుండి కెనాల్‌కు విడుదల చేస్తాం. అన్ని అనుకూలిస్తే నేడు సదర్మాట్ కెనాల్‌కు నీటివిడుదల చేస్తాం. అనుకోని కారణాలతో ఒకవేళ రద్దయితే త్వరలోనే తేదీని ప్రకటిస్తాం.

సదర్మాట్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలి



● బక్కశెట్టి వెంకట్రాములు, సదర్మాట్ ఆయకట్టు రైతు, సుర్జాపూర్

ఇప్పటికే నాట్లు వేసే ఎప్పం ఎత్తిపోతోంది. ఇంకా ఆలస్యమైతే తీవ్రంగా నష్టపోతాం. ఎస్సారెస్పీలో నీళ్లు లేవని సదర్మాట్‌కు నీటి విడుదలలో జాప్యం చేయొద్దు. వర్షానికి వస్తున్ననీటినైనా కెనాల్‌కు వదిలితే నార్లు పోసుకుంటాం. అధికారులు ఆలోచించి త్వరగా నీటి విడుదల చేయాలి.



జోన్‌ల మార్పుపై..
తొలగని సందిగ్ధం

- అమలుకు నోచుకోని మాస్టర్ ప్లాన్
- కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌లపై ఖరారు కాని నిర్ణయం
- వ్యవసాయ భూముల మార్పుపై కనిపించని స్పష్టత

ఇంటి నిర్మాణాల అనుమతులపై గందరగోళం

నిర్మల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించిన కొత్త మాస్టర్ ప్లాన్‌పై స్థానిక ప్రజలు పెట్టుకున్న ఆశలు క్రమంగా ఆవిరవుతున్నాయి. కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు నోచుకోకపోవడంతో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్‌ల పరిధిలో ఉన్న పట్టణ భూముల వ్యవహారం గందరగోళంగా మారుతోంది. అప్పట్లో రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల్లో భాగంగా ముఖ్యంగా ఇండస్ట్రియల్ జోన్ విషయంలో రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. కాగా 1990 మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్ జోన్ సోఫీనగర్ ప్రాంతంలో కొనసాగింది. అప్పటి నుంచి ఇటీవల వరకు సోఫీనగర్ ప్రాంతమంతా ఇండస్ట్రీయల్ జోన్‌లోనే ఉండేది. అయితే 2022లో రూపొందించిన కొత్త మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్ జోన్‌ను సోఫీనగర్ ప్రాంతం నుంచి తరలించి పచ్చని పంట పొలాలున్న మంజులాపూర్, తల్వేద గ్రామాలను ఇండస్ట్రియల్ జోన్‌లోకి చేర్చారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా అప్పట్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. దీనికి తోడుగా రైతులు కూడా రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు దిగివచ్చిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త మాస్టర్ ప్లాన్‌ను తాత్కలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది. రైతులు, స్థానికుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ఆ అభ్యంతరాలన్నింటిని పరిశీలించిన అనంతరమే కొత్త మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తామంటూ మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో రైతులు ఆందోళనలు తాత్కాలికంగా విరమించారు.

సర్కారు మారడంతో మళ్లీ తిరకాసు

కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలు ప్రతిపాదనలు రూపొందాయి. ఈ ప్రతిపాదనలపై అంతటా అభ్యంతరాలు వ్యక్తం కావడం స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో కొంత మేరకు ఆ మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పూర్తిస్థాయి మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని అప్పటి ప్రభుత్వం వెల్లడించింది. ఇంతలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం మారిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలపై ఊసే కనిపించడం లేదు. స్థానికులు జోన్‌ల మార్పు విషయంలో ఇప్పటికే సర్కారు దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు.

అనూహ్యంగా జీవో నెంబర్ 220 జారీ

కొత్తగా రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించినా అప్పటి అధికారులు రైతులు, స్థానికులకు సంబంధం లేకుండానే జీవో నెంబర్ 220 ని జారీ చేయడం వివాదానికి కారణమైంది. ఈ జీవో ప్రకారం అప్పటికే రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను ఫార్మల్ అప్రూవల్ (తాత్కలికంగా) పేరిట అమలు చేయాలని ఆ తరువాత రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం ఫైనల్ అప్రూవల్ చేయనున్నట్లు ఆ జీవోలో పేర్కొన్నారు. అప్పటి వరకు ఫార్మల్ అప్రూవల్ పేరిట జారీ అయిన ఉత్తర్వులను అమలు చేయాలని సూచించారు. స్థానికుల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు గడువు కూడా విధించారు. ఈ గడువులోగా దాదాపు 400లకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఆ అభ్యంతరాలన్నింటిని ఆన్‌లైన్ చేసినా ఇక్కడి మున్సిపల్ అధికారులు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు పంపారు. ఈ వ్యవహారమంతా జరిగి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త మాస్టర్‌ప్లాన్ పూర్తిస్థాయి అప్రూవల్‌పై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం ఇక్కడి రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

మాస్టర్ ప్లాన్ మార్పులపై అనుమానాలు

కాగా అప్పటి బీఆర్ఎస్ నేతలు పలుకుబడితో రూపొందించిన జీవో నెంబర్ 220 కొంతమందికే ప్రయోజనం చేకూర్చుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ జీవో జారీతో కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూములు కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌లోకి మారిపోయాయి. అయితే గ్రీన్‌జోన్‌లో ఉన్న గ్రామాలు ఇప్పటికీ కొత్త మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్ జోన్‌లోనే ఉండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. తమ నుంచి అభ్యంతరాలను స్వీకరించిన ఉన్నతాధికారులు ఇప్పటి వరకు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడం గాని కొత్త మాస్టర్‌ప్లాన్‌ను సవరించడం గాని చర్యలు చేపట్టకపోవడంతో తమ భూములు గ్రీన్‌జోన్ అలాగే రెసిడెన్షియల్ జోన్ నుంచి తొలగిపోయి ఇండస్ట్రియల్ జోన్‌లోనే కొనసాగవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో తాము అందజేసిన అభ్యంతరాలను సీరియస్‌గా పరిశీలించి తమ గ్రామాలను కొత్త మాస్టర్‌ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్ నుంచి తొలగించాలని కోరుతున్నారు.

కాగా గతంలో ఇంటి నిర్మాణాల కోసం కమర్షియల్ జోన్ అనే విషయం తెలియక చాలా మంది ఆ జోన్‌లోని భూములను కొనుగోలు చేశారు. అయితే కొత్త మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల్లో కొన్ని ప్రాంతాల్లోని కమర్షియల్ జోన్ భూములను రెసిడెన్షియల్ జోన్‌లుగా మార్చారు. అయితే కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకాకపోతుండడంతో జోన్‌ల మార్పు ఇప్పటికీ సాధ్యం కావడం లేదు. దీంతో ప్రస్తుతం కమర్షియల్ జోన్‌లో భూములు ఉన్న వారికి మున్సిపాలిటీ ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వడం లేదు. ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త మాస్టర్‌ప్లాన్ అమలైతే అనుమతుల సమస్య పరిష్కారానికి నోచుకుంటుందని పేర్కొంటున్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

• జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్



నిర్మల్‌లో మాస్టర్‌ప్లాన్ అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ జోన్‌ల ఏర్పాటు విషయంలో ప్రజల నుంచి కొంత వ్యతిరేకత వచ్చినట్లు సమాచారం ఉంది. అయితే దీని అమలుపై ప్రస్తుతం ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గతంలో ఉన్న జోన్‌లో యదావిధిగా కొనసాగుతాయి.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఉపాధిలో 'కనికట్టు' కుదరదిక

• రెండోసారి హాజరు తప్పనిసరి • అమలులోకి వచ్చి కొత్త నిబంధన

భైంసా, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా గ్రామీణా ప్రాంతాల్లో అభివృద్ధి, ఇతర పనుల ద్వారా ఉపాధి పొందుతున్న జాబ్ కార్డులున్న కూలీలకు ఇకపై రెండు పూటలా మస్టర్ నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం ఉపాధి కూలీల ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆయా మస్టర్ల ఆధారంగా వారికి వేతన చెల్లింపులు చేయనున్నారు.

అవకతవకలకు చెక్ పెట్టేందుకే..

ఉపాధి హామీ పనుల మస్టర్లలో జరుగుతున్న అవకతవకలను నివారించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు క్షేత్ర సహాయకులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) ద్వారా ఉదయం, మధ్యాహ్నం ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసేవారు. సామాజిక తనిఖీలు జరిగినప్పుడు కొన్ని చోట్ల మస్టర్లలో లోపాలు ఉండటంతో క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించే వారు. కొత్త విధానంలో ఉదయం, సాయంత్రం మస్టర్ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో తప్పనిసరిగా శ్రామికులు పని ప్రదేశంలో ఉండాల్సి వస్తోంది. ఈ విధానం వల్ల మస్టర్ నమోదు చేసి పని ఎగ్గొట్టే పరిస్థితి ఉండదు.

అలసత్వం వహిస్తే చర్యలు

క్షేత్ర సహాయకులు తీసే చిత్రాలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. అప్‌లోడ్ చేసిన ఫొటోలు సక్రమంగా ఉన్నాయా, లేవా అన్నది ఎంపీడీవోలు తనిఖీ చేస్తారు. మండల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన వాటిలో 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు పంపాలి.

నిబంధనలు ఇలా..

- ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మొదటి సారి హాజరు నమోదు చేసి ఫొటో అప్‌లోడ్ చేసిన 4 గంటల తర్వాత రెండో సారి మస్తరు వేయాలి.
- అప్‌లోడ్ చేయడంలో సమస్య ఎదురైతే ఫొటోలను సేవ్ చేసి.. అదే రోజు రాత్రి 12గంటల్లోగా అప్‌లోడ్ చేయాలి.
- మాన్యువల్ మస్టర్ అప్రూవల్‌కు సరైన కారణం ఎంపిక చేయాలి.
- రెండో సారి హాజరు పంపని క్షేత్ర సహాయకుడు, సీనియర్ మేట్లపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యాప్‌ను డిలీట్ చేసి మళ్లీ ఇన్‌స్టాల్ చేయకూడదు.
- పనికి హాజరైన కూలీల ఫొటోలు ఒక విడత మాత్రమే నమోదు చేస్తే.. మరుసటి రోజు నమోదుకు అవకాశం ఉండదు.

విధిగా రెండు సార్లు ఫొటో తీయాలి

• ప్రసాద్, ఏపీడీ, డీఆర్‌డీఏ, నిర్మల్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ రోజు పని ప్రదేశంలో హాజరైన కూలీలను విధిగా రెండు విడతలుగా ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. లేకుంటే మరుసటి రోజు ఉపాధి కల్పించే అవకాశం ఉండదు. క్షేత్ర స్థాయిలో ఈ ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ముథోల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని తరోడ గ్రామ రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భైంసా డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఎస్‌కే. జావిద్ పాషా మాట్లాడుతూ... ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని తెలిపారు. మొక్కలకు రాయితీతో పాటు నాలుగేళ్లకు రూ. 4,200ల చొప్పున ఏటా అంతర, యాజమాన్య పంటల ఖర్చులకు ప్రభుత్వం అందిస్తుంది. డ్రిప్ ఇరిగేషన్‌కు ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం రాయితీలు అందిస్తోందని, ఆయిల్ ఫామ్ సాగుతో 30 ఏళ్ల నికర ఆదాయం పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఎకరాకు 50 మొక్కలకు రూ. 1000 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిఇపారు. కూరగాయల సాగు చేసే రైతులు విత్తన శుద్ధి పాటించాలని తద్వారా పురుగు మందుల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. కూరగాయల రైతులు డ్రిప్ మల్చింగ్ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తే కూలీల ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చని తెలియజేశారు. ఆసక్తి గల కూరగాయ సాగు చేసే రైతులు డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాణి, మోహిన్, పంచాయతీ సెక్రటరీ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వల వివరాలు స్టాక్‌బోర్డుల్లో ప్రదర్శించాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్ » ఎరువుల దుకాణాల తనిఖీ

మామడ/ దస్తురాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ దుకాణాల్లో అందు బాటులో ఉన్న ఎరువుల వివరాలన్నీ రైతులకు తెలిసేలా స్టాక్ బోర్డుల్లో ప్రదర్శించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం మామడ మండల కేంద్రంలో గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణానికి సంబంధించిన వివరాలు కంప్యూటర్‌లో పరిశీలించారు. రశీదు పుస్తకాలను తనిఖీ చేశారు. యూరియా, ఎరువులు, ఇతర పురుగుల మందుల వివరాలను ఎరువుల దుకాణ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు పొందిన సంస్థలు తయారు చేసే నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులను మాత్రమే విక్రయించాలని అన్నారు. గడువు ముగిసిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించవద్దని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మి నట్లయితే చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికా రులు, ఏవో సంధ్య పాల్గొ న్నారు.



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఏవో

దస్తురాబాద్ మండలంలోని ఎరువుల దుకాణాలల్లో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు బిల్లులు, నిల్వలు, పరిశీలించారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ యాదవరావు, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి ఉన్నారు.

నేడు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

నిర్మల్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దివ్య గార్డెన్‌లో నేడు (బుధవారం) మధ్యాహ్నం మూడు గంటలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి రత్న కళ్యాని తెలిపారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథులుగా హాజరై, లబ్ధిదారులకు స్వయంగా కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరై, తమ రేషన్ కార్డులను స్వీకరించవలసిందిగా ఆర్డీవో విజ్ఞప్తి చేశారు.

ఖానాపూర్ : మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో నేడు (బుధవారం) లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలోని రైతు వేదికలో బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ల చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషిచేయండి

» ఎస్పీ జానకి షర్మిల » కడెం పోలీసుస్టేషన్ తనిఖీ

కడెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల అన్నారు. కడెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జి.జానకిషర్మిల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల గురించి ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. గంజాయి వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువతకు ప్రత్యేకంగా సైబర్‌నేరాల నివారణపై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకో వాలని,విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. అనంతరం ఎస్సై సాయికిరణ్‌ను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో మంగళవారం ఎస్పీ జి.జానకి షర్మిల ఐపీఎస్ కడెం ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాన్ని ప్రత్యేకంగా సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా అనుసంధానిత ఇరిగేషన్ అధికారులతో మాట్లా డి ఆపత్కాల పరిస్థితులకు ముందుగానే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 871265 9555ను సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట కడెం ఎస్సై సాయికిరణ్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

దరఖాస్తుల స్వీకరణ

భైంసా రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలో గురుకుల సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 31న ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ జరుగుతుందని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బి. సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల తమ పదవ తరగతి టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ సర్టిఫికెట్లు తీసుకుని కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజర్వేషన్ మెరిట్ ఆధారంగా కేటాయింపు ఉంటుందని తెలిపారు.

పాల వ్యాపారం పేరుతో భారీ మోసం

- 32 లక్షలు అప్పుగా తీసుకోని పరారైన నిందితుడు
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఇచ్చోడ, జుల్తై, 29 (ఆంధ్రజ్యోతి) : పాల వ్యాపారంలో చాలా లాభాలుంటాయాని డెయిరీ ఫాం పెడతున్నానని చెప్పి మిత్రుడి వద్ద రూ.4.50లక్షలు తీసుకుని పరారైన సంఘటన ఇచ్చోడ మండలంలో చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితుడు అక్కినపెల్లి శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెన్నపవర్ అభిషేక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు పేర్కొన్నారు. దాదాపు 20 మంది వద్ద నుంచి 32లక్షల వరకు తీసుకుని మోసగించాడని తెలిపారు. ఈ మేరకు అభిషేక్‌పై చీటింగ్ కేసు నమోదుచేశామన్నారు. నింధితుడు పరారీలో ఉన్నారని నిందితుడి కోసం గాలిస్తున్నమని పోలీసులు తెలిపారు.

రేషన్ కార్డులతో సంక్షేమ పథకాలు

• బీజేఎల్పీనేత మహేశ్వర్ రెడ్డి

మామడ/ లక్ష్మణచాంద/ సోన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాలన్నీ మరింత మెరుగ్గా ప్రజలకు చేరుతాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చాలా ఏళ్ల తర్వాత నూతన రేషన్ కార్డులు లబ్ధిదారులకు చేరడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఏపీవో శివాజీ, ఏపీఎం అరుణ, ఇతర అధికారులు, సిబ్బంది, రేషన్ కార్డుల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప ఉద్రిక్తత

లక్ష్మణచాంద మండలానికి చెందిన 18 గ్రామపంచాయతీలకు చెందిన 613 మంది లబ్ధిదారులకు మండల కేంద్రంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మంగళవారం కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించడం లేదని కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డిలను స్టేజ్ పైకి పిలవకుండా కార్యక్రమం నిర్వహించడం సబబు కాదని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం లో ఇరువర్గాలు పరస్పర నినాదాలతో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టర్ అభిలాష అభినవ్ జోక్యంతో గొడవ సద్దుమణిగింది. సోన్ మండల కేంద్రంలో 863 మంది లబ్ధిదారులకు కొత్తరేషన్ కార్డులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఎంపీడీవో సురేష్, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, నాయకులు సరికెల గంగన్న, హరీష్ రెడ్డి, నరేష్, సాగర్, సవీన్ పాల్గొన్నారు.



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్

రాష్ట్ర ఇన్‌చార్జితో డీసీసీ అధ్యక్షుడి భేటీ

ఖానాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీనాక్షినటరాజన్‌ను కలిసిన శ్రీహరిరావు జిల్లాలో పార్టీ స్థితిగతులను వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను ఆమెతో చర్చించారు. ఈ నెల 31వ తేదీ నుంచి మీనాక్షి నటరాజన్ ప్రజా సమస్యలను నేరుగా పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తెలిపారు. ఆగస్టు 4వ తేదీన ఖానాపూర్ నియోజకవర్గానికి మీనాక్షినటరాజన్ రానున్నారని ఆయ న పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కు మార్ గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శులున్నట్లు పేర్కొన్నారు.



మీనాక్షి నటరాజన్‌తో శ్రీహరి రావు

31న ఇంటర్ స్పాట్ కౌన్సెలింగ్

ముథోల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలుర)లో 2025-26 సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఎంపీసీ, బైపీసీ సీట్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో మొదటి ప్రయత్నంలోనే పాస్ అయిన పదో తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు.

మిగిలిపోయిన సీట్లకు...

సోన్ : సాంఘిక గురుకుల కార్యదర్శి అలుగు వర్షిని ఆదేశానుసారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల లెఫ్ట్ పోచంపాడ్‌లో మిగిలిన పోయిన ససీట్లకు ఈ నెల 31వ తేదీన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ జరుగుతుందని సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్ ఆర్. ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మార్చి 2025 పదవ తరగతి ఒరిజినల్ టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో కళాశాలలో ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారికి మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించి, సీట్లు అలాట్మెంట్ రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. వివరాలకు ఫోన్ నెంబర్ 8985850279ను సంప్రదించాలని తెలిపారు.



కొరటికల్‌లో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం

మామడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరటికల్ గ్రామంలో మంగళవారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 4వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. విష్ణు భట్ల రాజశేఖర్ శర్మ, వైదిక బృందం అభిషేక్ శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, మహాలక్ష్మీ దేవి, అభిషేకాలు, అలంకారాలు, అష్టోత్తరం పూజలు, అంగ పూజలు, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దివ్య లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ, భక్తులు భారీగా పాల్గొన్నారు. కొరటికల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం కళ్యాణ మహోత్సవం సందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్ నాయకులు, అధికారులు మొక్కులు తీర్చుకున్నారు.